సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 3 । మే । 2023



వీధి కుక్కల వీరంగం..
జిల్లాలో వీధి కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ దాడి చేసి గాయపరుస్తున్నాయి. 8లో



'పట్టు'కుంటే లాభాలే..!
తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే పట్టు పరిశ్రమల స్థాపనకు రైతులు ముందుకొచ్చేలా ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 25°
వాతావరణం
జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయ స్వామి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

మరో మూడు రోజులు వర్షాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో మరో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణమ్మ, పర్యావరణ శాస్త్రవేత్త వింధ్య, పర్యవేక్షకులు సుమన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారొక ప్రకటన విడుదల చేశారు. వరి, మొక్కజొన్న కోసిన రైతులు తడవకుండా టార్పాలిన్లు కప్పి భద్రపర్చుకోవాలని సూచించారు.

కోర్టు సముదాయాల పరిశీలన



సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెంలోని కోర్టు భవన సముదాయాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మంగళవారం పరిశీలించారు. కోర్టు హాల్, స్టాఫ్ రూంలు, లైబ్రరీ హాల్, జడ్జిల భవనాలను తనిఖీ చేసి, న్యాయమూర్తులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి అనితావాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, ఉపాధ్యక్షుడు దుంద్ర రమేష్, ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావు, సహాయ కార్యదర్శి కాసాని రమేష్, లైబ్రరీ సెక్రటరీ యాస యుగంధర్, ట్రెజరర్ సంతోష్‌సాహు, పీపీ పోసాని రాధాకృష్ణమూర్తి, ఏపీపీ పీవీడీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ భూముల్లో పనులు అడ్డగింత



ట్రాక్టర్‌తో బోరును తొలగిస్తున్న దృశ్యం

భద్రాచలం: ఏపీలోని పురుషోత్తపట్నంలో గల రామాలయ భూముల్లో జరుగుతున్న పనులను మంగళవారం ఈఓ రమాదేవి ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. దేవస్థానం భూముల్లో అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. దీనికి అనుబంధంగా మంచినీటి బోరు వేయడంతో పాటు ప్రహరీ నిర్మాణానికి గోతులు తీశారు. విషయం తెలియగానే ఈఓ స్పెషల్ ప్రొటెక్షన్ పోలీసులు, ఆలయ సిబ్బందితో అక్కడికి చేరుకుని గోతులను పూడ్చి బోరును ధ్వంసం చేశారు.

జలవనరుల శాఖలో ఈఈల బదిలీ

ఖమ్మంఅర్బన్: జలవనరుల శాఖలో ముగ్గురు ఈఈలను మంగళవారం బదిలీ చేసినట్లు తెలిసింది. ఖమ్మం జిల్లాలోని వైరా డివిజన్ ఈఈ శ్రీనివాసాచార్యులును భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లెందు ఈఈగా బదిలీ చేయగా, అక్కడ పనిచేస్తున్న మహేశ్వరరావును ములుగు డిప్యూటీ సీఈగా నియమించినట్లు సమాచారం. అలాగే, ములుగులో డిప్యూటీ సీఈగా ఉన్న కె.బాబురావును వైరా ఈఈగా నియమించినట్లు తెలిసింది. అయితే, వైరా ఈఈ శ్రీనివాసాచార్యులు బదిలీని ఆ ప్రాంత రైతులు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం.

ఎందుకీ వివక్ష?



విద్యారంగంలో సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ
- ఆరు జిల్లాల పరిధిలో స్కూళ్లు, కాలేజీల నిర్వహణ
- 'సొసైటీ'లో భారీగా కాంట్రాక్ట్ సిబ్బంది నియామకం
- పాఠశాల, కళాశాలల సిబ్బందికి వేతనాల చెల్లింపులో వ్యత్యాసం



సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దక్షిణ భారతదేశంలో ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థగా ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్మికుల సంక్షేమం విషయంలో అనేక చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీని ఏర్పాటు చేసింది. దీని ద్వారా సింగరేణి కార్మికులు, సింగరేణి ప్రభావిత ప్రాంతాల వారి పిల్లలు చదువుకునేందుకు వీలుగా ఆరు జిల్లాల పరిధిలో 9 పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కాలేజీ (కొత్తగూడెం), పాలిటెక్నిక్ కాలేజీ(సీసీసీ)లు ఏర్పాటు చేసింది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఈ సొసైటీని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రెగ్యులర్, కాంట్రాక్ట్ పద్ధతిన సిబ్బంది నియామకాలు భారీగా చేపట్టింది. ఇలా 2016, 17, 18 సంవత్సరాల్లో విడతల వారీగా 300 మంది వరకు బోధన, బోధనేతర సిబ్బందిని నియమించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీరందరికీ ఫుల్ టైం స్కేల్(ఎఫ్‌టీఎస్) వేతనం ఇవ్వడంతో పాటు ఏడాదిలో 12 నెలల కాలానికి చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇలా వేతనాలు చెల్లించే విషయంలో పాఠశాల స్థాయిలో పని చేసే వారికి ఓ రకంగా, ఆపై విద్యాసంస్థల్లో పని చేసే వారికి మరో రకంగా ఉంటోంది.

కొందరికి అలా.. మరి కొందరికి ఇలా..

కొత్తగూడెంలోని మహిళా డిగ్రీ, జూనియర్ కాలేజీ, సీసీసీ దగ్గరున్న పాలిటెక్నిక్ కాలేజీలో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి బయట ప్రభుత్వ కాలేజీలో కాంట్రాక్ట్ సిబ్బందికి చెల్లిస్తున్నట్టుగానే ఎఫ్‌టీఎస్ ప్రకారం సగటున నెలకు రూ. 42,000 వేతనం అందుతోంది. ఇదే సమయంలో ఆరు జిల్లాల పరిధిలోని తొమ్మిది పాఠశాలల్లో పని చేస్తున్న సుమారు 130 మంది బోధన, బోధనేతర సిబ్బందికి ఎఫ్‌టీఎస్ ప్రకారం వేతనాలు అందడం లేదు. వీరికి ప్రస్తుతం నెలకు సగటు జీతం రూ. 22,750 వేతనం మాత్రమే అందుతోంది. అంతేకాదు.. ఏడాదిలో 12 నెలలకు కాకుండా 10 నెలల కాలానికే జీతం ఇస్తున్నారు.

గురుకులం తరహాలో..

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో టీచర్లు లేరు. దీంతో సింగరేణి సంస్థ తన సొసైటీ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిన పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ఎఫ్‌టీఎస్ ప్రకారం వేతనం చెల్లించేందుకు నిరాకరిస్తోంది. ఇదే సమయంలో ప్రభుత్వ పరిధిలో ఉన్న వివిధ గురుకుల సొసైటీల్లో కాంట్రాక్టు టీచర్లకు సగటున రూ.43,000 వరకు వేతనం అందుతోంది. దీంతో తమకు గురుకుల సొసైటీల తరహాలో ఎఫ్‌టీఎస్ ప్రకారం వేతనం చెల్లించాలంటూ సుమారు 130 మంది టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది 2018 నుంచి సంస్థను కోరుతున్నారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ జనరల్ మేనేజర్ మొదలు డైరెక్టర్ పా, సీఎండీ వరకు అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చారు. నాలుగేళ్లుగా వీరు చేస్తున్న వినతులు బుట్టదాఖలు అవుతున్నాయే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదు. దీనిపై సింగరేణి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

వేసవిలో కూలి పనులకు..

సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ పరిధిలోని పాఠశాలల్లో పని చేస్తున్న సిబ్బందికి ఫుల్ టైం స్కేల్ అమలు చేయకపోవడంతో ప్రతీ ఉద్యోగి నెలకు సగటున రూ.20 వేల చొప్పున నష్టపోతున్నారు. అదే విధంగా వేసవిలో రెండు నెలల పాటు జీతం లేకుండా ఇబ్బందులు పడుతున్నారు. నాలుగేళ్లుగా ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేదు. దీంతో సొసైటీలోని పాఠశాలల్లో పని చేసే సిబ్బంది వేసవిలో ఉపాధి హామీ పనులకు కూడా వెళుతున్నారు. ఒకే సొసైటీ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందికి చెల్లించే జీత భత్యాల విషయంలో తేడాలు చూపించడం సరికాదని పాఠశాల సిబ్బంది అంటున్నారు.

జాతీయ అవార్డు స్ఫూర్తితో ముందుకు..

- ప్రతి మండలంలో ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ ప్లాంట్ నిర్మించాలి
- ఎంపీడీఓలకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రానున్న 25 రోజుల్లో ప్రతి మండలానికి ఒక ప్లాస్టిక్ వ్యర్థ నిర్వహణ ప్లాంట్ నిర్మించాలని కలెక్టర్ అనుదీప్ ఎంపీడీఓలను ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఐడీఓసీ సమావేశ మందిరంలో మంగళవారం డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఎంపీడీఓలు, ఎంపీఓలకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గౌతంపూర్‌కు వచ్చిన జాతీయ అవార్డు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆ పంచాయతీలో గోబర్ధన్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని చుంచుపల్లి ఎంపీడీఓను ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జిల్లాలోని 481 పంచాయతీల్లో నిర్వహించిన సెల్ఫ్ అసెస్‌మెంట్‌ను తిరిగి తనిఖీలు చేపట్టేందుకు ఎంపీఓ, ఇద్దరు కార్యదర్శులు, సెర్ప్ సిబ్బంది మొత్తం 90 మందితో 30 టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ టీమ్‌లు క్షేత్రస్థాయి తనిఖీల్లో గుర్తించిన అంశాలపై వాస్తవ నివేదికలు అందజేయాలన్నారు. జూన్ 15 నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. దీన్ని పర్యవేక్షించాలని ఎంపడీఓలను ఆదేశించారు. ఓడీఎఫ్ ప్లస్ మోడల్ గ్రామాలను ప్రకటించడానికి చేపట్టిన ఈ కార్యక్రమాల నిర్వహణపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు సమగ్ర అవగాహన ఉండాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, పీడీఓ రమాకాంత్, పీడీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటర్ జాబితాకు సహకరించాలి

తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ అనుదీప్ కోరారు. తన చాంబర్‌లో మంగళవారం వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పార్టీలు బూత్ ఏజెంట్లను నియమించి, జాబితాను అందజేయాలని సూచించారు. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ వచ్చిన 18,438 పేర్లలో 508 తొలగించామని, వీటిలో 38 మంది మరణించగా, 92 మంది ఇతర పోలింగ్ కేంద్రాలకు వలస వెళ్లారని చెప్పారు. ఓటర్ల తొలగింపు తప్పుగా నమోదైన 378లో 150 మందిని తిరిగి నమోదు చేశామని, 228 మంది ఓటు హక్కు పొందాల్సి ఉందని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న పోలింగ్ కేంద్రాలను మార్చాలని వివిధ పార్టీల ప్రతినిధులు సూచించగా వివరాలను అందజేస్తే మార్పునకు ఎన్నికల సంఘానికి పంపిస్తామని కలెక్టర్ అన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం తహసీల్దార్ సురేష్‌కుమార్, సిబ్బంది నవీన్, సీపీఎం నాయకుడు అన్నవరపు సత్యనారాయణ, సీపీఐ నుంచి సలిగంటి శ్రీనివాస్, బీజేపీ తరపున లక్ష్మణ్ అగర్వాల్, బీఆర్‌ఎస్ నాయకుడు షేక్ అన్వర్, బీఎస్పీ నుంచి యెర్రా కామేష్ పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: శ్రీదుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణ సంస్థ హైదరాబాద్‌లో 2023 – 24 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు ఈనెల 9 వరకు గడువు ఉందని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన బాలికలు, నిరుపేద బాలికలు మాత్రమే అర్హులని తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన వారు ఎలాంటి అర్హత పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. డిప్లొమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో డైరెక్టర్ తనిఖీ

20 మంది వైద్యులకు మెమోలు, ఫార్మసిస్ట్ బదిలీ



క్యాంటీన్‌లో అల్పాహారాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ (పా) బలరామ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రిని డైరెక్టర్ (పా) ఎన్.బలరామ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్డుల్లో వైద్యసేవలు, క్యాంటీన్, ఫార్మసీ విభాగంలో పరిశీలించారు. సమయపాలన పాటించడం లేదని తేలడంతో ఇరవై 20 మంది వైద్యులకు అక్కడికక్కడే మెమోలు జారీ చేశారు. అలాగే, విధుల్లో లేని ఫార్మసిస్ట్‌ను బదిలీ చేశారు. ఆ తర్వాత క్యాంటీన్‌లో టిఫిన్ల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బలరామ్ మాట్లాడుతూ భూగర్భగనిలో గాయపడిన కార్మికుడికి ఆరు నెలల పాటు సర్ఫేస్ విధులు కేటాయించాలని సీఎంఓను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, హాజరు నమోదయ్యాక బయటకు వెళ్లినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్మికుల కష్టార్జితంతో వేతనాలు తీసుకుంటున్న వారు విధుల్లో అలసత్వం వహించొద్దని సూచించారు. ఆస్పత్రి సీఎంఓ బి.వెంకటేశ్వరరావు, ఏజీఎంఓలు విక్టర్ వందనం, సుజాత, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ బి.హన్మంతరావు, డీజీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

'ఆహార ఫెసిలిటీ'కి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం: జీవనోపాధి పెంపొందించుకోవడానికి చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో వ్యవసాయ ఆహార ఫెసిలిటీ నిర్మాణానికి ఆసక్తి, అనుభవం కలిగిన సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గిరిజన యువతకు గానుగ మిల్లులను అందించటం దీని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు బ్యాంక్ ఖాతా తప్పనిసరని తెలిపారు. ఆసక్తి, అనుభవం గల సంస్థల ప్రతినిధులు భద్రాచలం ఐటీడీఏ ఈఈ కార్యాలయంలో ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు దరఖాస్తులు పొందవచ్చని వివరించారు. దరఖాస్తుకు రూ.2వేలు, డిపాజిట్ రూ.50 వేలు ఐటీడీఏ ఈఈ పేరున డీడీ తీయాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఐటీడీఏ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. 10వ తేదీ ఉదయం 11 గంటలకు టెండర్ ఖరారు చేస్తామని పేర్కొన్నారు.

ఎన్నెన్నో వర్ణాలు !



వాతావరణంలో రెండు, మూడు రోజులుగా మార్పులు కనిపిస్తున్నాయి. ఓపక్క వర్షం కురుస్తూ వాతావరణం చల్లబడగా.. అక్కడక్కడా ఎండగా కూడా నమోదవుతోంది. ఇదేక్రమాన వైరా రిజర్వాయర్ వద్ద మంగళవారం సాయంత్రం ఓవైపు చిరు జల్లులు పడుతుండగా ఆకాశం కొత్త అందాలు సంతరించుకుని కనిపించింది. సూర్యాస్తమయ సమయాన నిమిషాల వ్యవధిలో వర్ణాలు మార్చుకుంటున్న ఆకాశాన్ని రిజర్వాయర్ సమీపాన వాకింగ్ చేస్తున్న వారు, స్థానికులు ఆశ్చర్యంగా తిలకించారు. – వైరా

ప్రతీ ధాన్యం గింజా కొంటాం

- రైతులు అధైర్య పడొద్దు
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడొద్దని అదనపు కలెక్టర్ కె. వెంకటేశ్వర్లు అన్నారు. ఐడీఓసీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని అన్నారు. నాణ్యత లేదంటూ రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులకు సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు సహకార శాఖ ద్వారా 3243.160 మెట్రిక్ టన్నులు, జీసీసీ ద్వారా 247.360 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు కూడా నాణ్యమైన ధాన్యాన్నే తీసుకురావాలని కోరారు. తూకం వేసిన తర్వాత ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రైస్ మిలుల్ల వద్ద ధాన్యం అన్‌లోడ్‌లో జాప్యం జరగొద్దని, దిగుమతి చేసిన ధాన్యం వివరాలను ఓపీఎంఎస్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. సమావేశంలో డీఎస్‌ఓ మల్లికార్జున్, డీఎం త్రినాథ్, డీఏఓ అభిమన్యుడు, మార్కెటింగ్ డీఎం అలీం, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జుగల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి పిల్లల వైద్యం

ఇల్లెందులో వారానికి మూడు రోజులు సేవలు



ఎస్‌బీఎస్‌యూ యూనిట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్న పిల్లల వైద్యం కూడా అందుబాటులోకి వచ్చింది. కలెక్టర్ అనుమతితో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి.రవిబాబు వారంలో మూడు రోజుల పాటు అందుబాటులో ఉండేలా చిన్నపిల్లల వైద్యుడు శ్రీకాంత్‌ను నియమించగా ఆయన మంగళవారం విధుల్లో చేరారు. ప్రతీ మంగళ, గురు, శనివారాల్లో పిల్లల వైద్యుడు అందుబాటులో ఉంటారని డీసీహెచ్‌ఎస్ తెలిపారు. కాగా, ఆస్పత్రిలో రెండేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్న చిన్నపిల్లల వైద్యానికి సంబంధించి ఎస్‌బీఎస్‌యూను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ మేరకు డాక్టర్ శ్రీకాంత్ పలువురు చిన్నారులకు పరీక్షలు నిర్వహించడమే కాక యూనిట్‌ను పరిశీలించి మాట్లాడారు. చిన్న పిల్లలకు వైద్య సేవలు ప్రారంభం అయినందన చికిత్స కోసం ఖమ్మం, కొత్తగూడెం వెళ్లాల్సిన బాధ తప్పినట్లేనని చెప్పారు.

అవినీతికి నిలయంగా..!

- కొత్తగూడెం మున్సిపాలిటీపై ఆరోపణల వెల్లువ
- ఉద్యోగులే కాంట్రాక్టర్ల అవతారం..
- పనుల్లో కొరవడుతున్న నాణ్యత
- తమను అడిగేవారు ఉండరనే ధీమా



కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రంలో ఏ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న కొత్తగూడెం ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలవాల్సింది పోయి, అవినీతి ఆరోపణలకు నిలయంగా మారింది. పాలకవర్గంలోని కొందరు గతంలో ఈ ఆరోపణలు ఎదుర్కోగా, ప్రస్తుతం అధికారులూ అదే దారిలో నడుస్తున్నారు. వీరితో పాటు వివిధ విభాగాల్లో పని చేసేవారు ఒక వైపు కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తూనే, మరో వైపు కాంట్రాక్టర్‌గా అవతారమెత్తుతున్నారు. ఈ అవకాశం రావడానికి ఎంత ఖర్చయినా వెనకడుగు వేయకుండా పనులు దక్కించుకుని, నాసిరకంగా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే నామినేషన్ పద్ధతిలో చెత్త బుట్టలను హడావిడిగా కొనుగోలు చేయగా, అందులోనూ లక్షల రూపాయలు చేతులు మారాయని, అధికారులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఇక అభివృద్ధి పనుల కోసం క్వాలిటీ కంట్రోల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రూ.1.50 కోట్ల టెండర్‌లోనూ భారీగా అవినీతి జరిగిందని తెలుస్తోంది. ఈ విషయమై అధికార పార్టీ కౌన్సిలర్లే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన ఇరిగేషన్ ఈఈ అర్జున్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈ క్రమంలో అర్జున్ కొత్తగూడెం మున్సిపాలిటీలో విచారణ నిర్వహించి ఆధారాలు సేకరించే పనిలో పడ్డారు. రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి, రిపోర్టు తయారు చేసి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నారు. అనంతరం నివేదికలో ఉన్న ఆధారాలను బట్టి మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నిధులు కేటాయిస్తున్నా పనులేవి..?

కొత్తగూడెం మున్సిపాలిటీలో మరమ్మతులు, పరికరాల కొనుగోళ్లు, వివిధ పనులకు ప్రతి నెల కౌన్సిల్ సమావేశంలో రూ.లక్షలకు ఆమోదం తెలుపుతున్నారు. కానీ పనులు మాత్రం ఎక్కడా జరిగిన దాఖలాలు కనిపించడం లేదు. ఆ నిధులన్నీ ఏమవుతున్నాయో అధికారులు, పాలక మండలి సమాధానం చెప్పాలని పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలో చేతిపంపుల మరమ్మతు, కొత్త బోర్ల కోసం గత మార్చిలో రూ.97 లక్షలు కేటాయించారు. కానీ మున్సిపాలిటీ పరిధిలో చేతి పంపులకు రిపేర్లు చేయించిన రుజువులూ లేవు.. కొత్త బోర్లు వేసిన దాఖలాలూ లేవు.

ఉద్యోగులే కాంట్రాక్టర్లు..

ఈ మున్సిపాలిటీలో పని చేసే కొంతమంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే రహస్యంగా కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారని తెలుస్తోంది. వారిలో ప్రధానంగా మున్సిపాలిటీలో ఓ ఏఈకి అసిస్టెంట్, ఎలక్ట్రికల్ విభాగంలో పని చేసే వ్యక్తి, పంపు కనెక్షన్ల విభాగంలో పని చేసే వ్యక్తి, మరో ఇద్దరు బయట కాంట్రాక్టర్లతో కలిసి పనులు చేస్తున్నారు. అయితే తమను ప్రశ్నించేవారు ఉండరనే ధీమాతో వారు నాసిరకంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రతి నెల కిన్నెరసాని పైపు లైన్లు మరమ్మతులకు గురవుతూనే ఉన్నాయి. నామినేషన్ పద్ధతి అంటూ పనులు, టెండర్లను కాంట్రాక్టు ఉద్యోగులకు అప్పగించి అధికారులు రూ.లక్షల్లో మున్సిపాలిటీ నిధులను దండుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. సిబ్బంది తప్పు చేస్తే చర్యలు తీసుకోవాల్సిన అధికారులే అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో మున్సిపాలిటీ పాలన గాడి తప్పుతోందని పలువురు అంటున్నారు.

రెండు రోజుల్లో విచారణ పూర్తి

కొత్తగూడెం మున్సిపాలిటీలో కమిషనర్, డీఈలపై, అధికార పార్టీ కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ అధికారి హోదాలో ఎంక్వైరీ చేస్తున్నా. అన్ని వివరాలు సేకరిస్తున్నా. మరో రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి, కలెక్టర్‌కు నివేదిక అందజేస్తా.
–అర్జున్, ఇరిగేషన్ ఈఈ

క్లుప్తంగా

ఖాళీ బిందెలతో బీఎస్పీ ధర్నా


ధర్నా చేస్తున్న మహిళలు, బీఎస్పీ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మున్సిపాలిటీలో తొమ్మిది రోజులుగా కిన్నెరసాని మంచినీరు సరఫరా జరగక ప్రజలు అల్లాడుతున్నారని, మంచినీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేశ్ మాట్లాడుతూ ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నా ఎమ్మెల్యే ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. స్థానిక అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు కూడా స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఏటా మరమ్మతులు, నూతన పైపులు ఏర్పాటు చేస్తున్నామని భారీ ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని, సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని, ఆ నిధులను ఎటు మళ్లిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు సాయి, మాలోత్ వీరూనాయక్, ఇస్లావత్ కల్యాణి, నిర్మల, వైశాలి, శాంభవి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'నీ గానమే నా ప్రాణం'

12 గంటల పాటు సాగిన భజన కార్యక్రమం


భజన కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని హరిహర క్షేత్రంలో ప్రతిష్టాత్మకంగా భద్రాచలం అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'నీ గానమే నా ప్రాణం'కార్యక్రమం ఆహుతులను కట్టిపడేసింది. ముందుగా ఉదయం 6 గంటలకు ధ్వజారోహణం, గోపూజతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 12 గంటల పాటు నిరంతరాయంగా అఖండ భజనా కార్యక్రమంతో భక్తులను అలరించారు. అనంతరం పడిపూజ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి డీసీసీబీ అధ్యక్షుడు కురాకుల నాగభూషణం ముఖ్య అతిథిగా హాజరై భజన కార్యక్రమాన్ని వీక్షించారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు


తనిఖీల్లో పాల్గొన్న సీఐ రాజగోపాల్

పినపాక: ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఇటీవల మావోయిస్టులు దాడులకు పాల్పడిన నేపథ్యంలో స్థానిక పోలీసులు అప్రమత్తమయ్యారు. గోదావరి పరీవాహక ప్రాంతం కావడంతో పోలీసులు గ్రామాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. రహదారిపై వాహనదారులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి పంపిస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ రాజగోపాల్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు తారసపడితే తమకు సమాచారం అందించాలని సూచించారు. అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించినా, సహాయం అందించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి


సత్తిరాజు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ఎదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన పాకనాటి సత్తిరాజు (45) శ్రీరంగాపురం సమీపంలోని పొలం పనులు చూసుకొని టీవీఎస్ ఎక్సెల్‌పై తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. నారంవారిగూడెం వద్ద అచ్యుతాపురం వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం లారీని తప్పించే క్రమంలో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్తిరాజును స్థానికులు అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేసే క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. మరో ద్విచక్రవాహనంపై ఉన్న అచ్యుతాపురానికి చెందిన నరేంద్ర, నానికి గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సత్తిరాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు నాగబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

వీధి కుక్కల వీరంగం..

- పల్లెలు, పట్టణాల్లో స్వైర విహారం
- రోజుకు ఒకరిద్దరికి గాయాలు
- గత నెలలో 15 మందిపై శునకాల దాడి


ఓ వీధిలో సంచరిస్తున్న కుక్కలు, (ఇన్‌సెట్) సర్వారంలో పిచ్చికుక్క దాడిలో చిన్నారి చేతిపై గాయం (ఫైల్)

మంచుపల్లి: వీధి కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గుంపులుగుంపులుగా సంచరిస్తూ అకారణంగా దాడి చేసి గాయపరుస్తున్నాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లో ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ కనిపించినవారిని కరుస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. కాలినడకన, వాహనాలపైన వెళ్తున్న వారి వెంటపడుతూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. వీధి కుక్కల దెబ్బకు ఇంటి నుంచి బయటకు రావాలన్నా.. బయటకు వచ్చిన వారు తిరిగి ఇంటికి చేరుకోవాలన్నా బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల ఎక్కువగా చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు కుక్క కాటు బాధితులుగా మారుతున్నారు. రోజులో ఏదో ఒకచోట కుక్క కాటుకు గురైన ఘటన వెలుగులోకి వస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులకు రోజుకు కనీసం ఇద్దరు లేదా ముగ్గురు చికిత్స కోసం వస్తున్నారు. ఏప్రిల్‌లో వీధి కుక్కలు మరింతగా రెచ్చిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆ నెలలో ఎక్కువ మందిపై వీధి కుక్కలు దాడులు చేసిన ఘటనలు ఉన్నాయి. ఏకంగా 15 మందిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ సంఖ్య అనధికారికంగా ఎక్కువగానే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా టేకులపల్లి మండలం తొమ్మిదో మైలుతండా పరిధిలోని కోటల్లా గ్రామానికి చెందిన యువతి కొటెం శిరీష పిచ్చి కుక్క కాటుకు గురై చికిత్స తీసుకోక పోవడంతో కొద్ది రోజుల కిందట మృతి చెందిన విషయం విదితమే. వీధి కుక్కలను నియంత్రించడి మహాప్రభో అని ప్రజలు మున్సిపల్, పంచాయతీ అధికారులకు మొరపెట్టుకుంటున్నా వారిలో ఏమాత్రం చలనం లేదు. దీంతో రోజువారీ కుక్క కాటు బాధితులు పెరిగిపోతున్నారు.

ఐదేళ్లుగా జిల్లాలో కుక్క కాటు కేసులు

2018	6,712	2021	4,456
2019	3,812	2022	2,210
2020	2,438	2023	1,047

పిచ్చి కుక్కలతో ప్రమాదం

ఇటీవల జిల్లాలో చిన్న పిల్లలు, మహిళల మీద వీధి కుక్కల దాడులు అధికమతున్నాయి. వాటి దాడిలో చాలా మంది తీవ్రంగా గాయపడుతున్నారు. కుక్క కాటును రోజుల కొద్దీ నిర్లక్ష్యం చేయకుండా దాడికి గురైనప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. వీధి కుక్కలన్నీ పిచ్చికుక్కలు కావు. వీధి కుక్క కరవగానే వీలయితే దాన్ని కొంతకాలం పాటు గమనించాలి. సాధారణంగా పది రోజుల వరకు కుక్క మామూలుగానే తిరుగాడుతుంటే అది ప్రమాదం లేనిదని గుర్తించండి. కుక్క కరచినప్పుడు అయిన గాయాన్ని శుభ్రమైన నీటి ప్రవాహం కింద కడగాలి. అంటే.. మగ్‌తో నీళ్ల పోస్తూ గాని, కుళాయి కింద గానీ ఉంచి నీళ్ల పడుతుండగా సబ్బుతో, వీలైతే డెట్టాల్‌తో శుభ్రంగా కడగాలి. పాము కాటులా కుక్కకాటుకు తక్షణమే చికిత్స అవసరం లేదు. పిచ్చికుక్క అని అనుమాన ముంటే టీటీ ఇంజెక్షన్, గాయానికి ప్రాథమిక చికిత్స చేయించుకొని ఒకటి రెండు రోజుల్లో అసలు చికిత్స ప్రారంభించవచ్చు. కుక్క కాటు తర్వాత రేబిస్ వచ్చే అవకాశాలు ఎక్కువ కాబట్టి ఆలస్యం చేయకుండా డాక్టర్ సలహాతో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అవసరాన్ని బట్టి మూడు లేదా నాలుగు మోతాదుల్లో తీసుకోవాలి. గతంలో మాదిరిగా పిచ్చికుక్క కాటుకు అందించే చికిత్స (బొడ్డు చుట్టూ ఇంజెక్షన్లు) ఇప్పుడు లేదు. 3-7-28 రోజులకు కేవలం నాలుగు డోసులు నొప్పిలేని సాధారణ ఇంజెక్షన్ రూపంలో తీసుకుంటే చాలు. ఇంట్లో పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా నిర్ణీత వ్యవధిలో యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి. దాని వల్ల ఇంట్లోని వారికి, ఇతరులకు కూడా ప్రమాదం తప్పుతుంది. కుక్కకాటుకు అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఉచిత చికిత్స, వ్యాక్సిన్ లభిస్తుంది.

మైనింగ్ భూమిని పరిశీలించిన అధికారులు


అనుమతి పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

సుజాతనగర్: మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామ పరిధిలోని మైనింగ్ భూమిలో అటవీ, మైనింగ్ శాఖాధికారుల ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. గ్రామ పరిధిలో కె.వెంకటేశ్వరరావు ఏడేళ్లుగా రంగురాళ్ల తవ్వకాలు జరుపుతున్నాడు. సదరు భూమిలో రంగురాళ్ల నిక్షేపాలు లేవంటూ జిల్లాకు చెందిన మైనింగ్ అధికారులు ఇటీవల అనుమతులు నిలిపేశారు. దీంతో లీజుదారుడైన వెంకటేశ్వరరావు కోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు సదరు భూమిలో అధికారులు సర్వే నిర్వహించారు. భూమి హద్దులను నమోదు చేసుకోవడంతోపాటు మట్టి నమూనాలు, రంగురాళ్లను సేకరించారు. నివేదికను కోర్టుకు సమర్పిస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ మధూసూదన్‌రెడ్డి, ఏడీ స్వామి, జిల్లా ఏడీ జయసింగ్, అసిస్టెంట్ జియాలజిస్ట్ నిరంజన్, ఎఫ్‌డీఓ అప్పయ్య, ఎఫ్‌ఆర్వో ఉమ, సర్వేయర్ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచుపల్లి: జిల్లాలో వైద్య, ఆరోగ్యశాఖలో ఎన్‌హెచ్‌ఎం పథకం కింద రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో ఖాళీగా ఉన్న మూడు మెడికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జేవీఎల్ శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 3 నుంచి 6 తేదీ వరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వచ్చే నెలలో పీవైఎల్ రాష్ట్ర మహాసభలు


మాట్లాడుతున్న గోవర్దన్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర రెండో మహాసభలను వచ్చే నెల 3, 4వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవర్దన్ తెలిపారు. ఖమ్మం జెడ్పీ హాల్‌లో పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రాజేందర్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటుచేసిన మహాసభల సన్నాహక సమావేశంలో గోవర్దన్ మాట్లాడారు. కోటి ఆశలతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కడం లేదని తెలిపారు. నిరుద్యోగ సమస్యకు తోడు ప్రశ్నపత్రాల లీకేజీ తదితర అంశాలపై మహాసభల్లో చర్చించి పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అనంతరం సీహెచ్ బాబూరావు అధ్యక్షుడిగా ఆహ్వాన సంఘాన్ని నియమించారు. ఈ సంఘంలో ఎ.రాజేందర్, ఎం.గిరితో పాటు 100 మంది సభ్యులు ఉంటారని వివరించారు. సమావేశంలో నాయకులు బాబూరావు, వేణు, ఎం.శ్రీనివాస్, ఎం.గిరి, కె.సురేశ్, హన్మంతరావు, శోభారాణి, నిర్మల, తేజ, మోకాళ్ల రమేశ్, తుడుం వీరభద్రం, భానుచందర్, ధనసరి కుమారి పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ అజెండా ఒక్కటే..


మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీమనోహర్

ఖమ్మం మామిళ్లగూడెం: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అజెండా ఒక్కటేనని ఓయూ ప్రొఫెసర్ మురళీమనోహర్ అన్నారు. తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యాన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి సదస్సు ఖమ్మంలోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా మురళీమనోహర్ మాట్లాడుతూ బ్రాహ్మణవాదంతో ప్రతీ పార్టీ ప్రజలకు విభజిస్తోందని, తద్వారా బీసీలను ఎస్సీలు, ఎస్సీలను బీసీలు, మైనార్టీలను బీసీలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఈ కారణంగా కులగణన చేపట్టడం లేదని, ఫలితంగా దేశంలో 54 శాతం ఉన్న బీసీలకు రాజ్యాధికారం రావడం లేదని విమర్శించారు. ఈమేరకు సామాజిక న్యాయమే ఏకైక అజెండాగా సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఆవిర్భవించిందని తెలిపారు. ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు దాస్‌రాంనాయక్ మాట్లాడుతూ 1,200 మంది బలిదానం చేసినప్పటికీ ప్రజాస్వామ్యవాదులు కోరినట్లుగా కాకుండా భౌగోళిక తెలంగాణ మాత్రమే వచ్చిందన్నారు. సామాజిక తెలంగాణ సాధన కోసం మరో ఉద్యమం అవసరమని చెప్పారు. ఈ సదస్సుకు భద్రూనాయక్ అధ్యక్షత వహించగా డాక్టర్ ఎం.ఎఫ్.గోపీనాథ్, వెంకటేశ్వర్లు, శేఖర్‌గౌడ్, విజయకుమార్, రవీందర్ నాయక్, నరేందర్, కనకరాజు, జంగిపల్లి రవి, సంజీవరావు, రెహమాన్, చైతన్య, లిక్కి కృష్ణరావు, రాజు, గిరి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు


ఇందారపు లక్ష్మి (ఫైల్)

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆదర్శనగర్‌కాలనీకి చెందిన వివాహిత ఇందారపు లక్ష్మి అదృశ్యంపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన లక్ష్మి సాయంత్రం వరకు కూడా తిరిగిరాలేదు. దీంతో ఆమె భర్త లక్ష్మణ్‌రావు స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో ఆయన పోలీసులుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్రవాహనం చోరీపై ...

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి గ్రామంలో ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నాగుపల్లి గ్రామానికి చెందిన తీట్ల వరకల్యాణ్ మార్చి 19వ తేదీ రాత్రి తన ద్విచక్రవాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశాడు. తెల్లవారుజామున నిద్రలేచి చూడగా ద్విచక్రవాహనం లేదు. చుట్టుపక్కల వారిని విచారించి చూడగా ఆచూకీ లభించకపోవడంతో చోరీ జరిగిందని భావించాడు. వరకల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

వేటకు వెళ్లి మృతిచెందిన ఘటనపై కేసు

ములకలపల్లి: అల్లిగూడెం అటవీప్రాంతానికి వేటకు వెళ్లి ఓ యువకుడు మృతిచెందిన ఘటనపై వీఆర్‌ఏ కనకం శ్రీనివాస్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అల్లిగూడెంనకు చెందిన ఊకే నాగేంద్ర దమ్మపేట మండలం రాచూరుపల్లి గ్రామానికి చెందిన సవలం నాగరాజు ఇటీవల సమీప అటవీప్రాంతానికి వేటకు వెళ్లారు. ఐతే తుపాకీ మిస్‌ఫైర్ అయి నాగరాజు గాయాలపాలయ్యాడని నాగేంద్ర తెల్లవారుజామున గ్రామస్తులకు సమాచారం అందించి పరారయ్యాడు. దీంతో గ్రామస్తులు, నాగరాజు బంధువులు సమీప అడవిలో గాలించగా, దేవినేనిగుట్ట సమీపంలో నాగరాజు మృతదేహం లభించింది. గుట్టుచప్పుడు కాకుండా నాగరాజు మృతదేహాన్ని ఆటోలో స్వగ్రామమైన రాచూరిపల్లికి తరలించి మొక్కజొన్న తోటలో దహనం చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా దహన సంస్కారాలు చేయడం, నాగరాజు మృతిపై అనుమానాలున్న నేపథ్యంలో వీఆర్‌ఏ కనకం శ్రీనివాస్ మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

నాటు తుపాకీ స్వాధీనం?

వేట ఘటనలో పోలీసులు విచారణ షురూ చేసినట్లు తెలిసింది. నాగరాజు మృతి విషయంలోని వాస్తవాలు వెలికి తీసేందుకు విచారణ నిర్వహిస్తున్నట్లు సమాచారం. వేటకు తీసుకెళ్లిన నాటు తుపాకీని సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డిని వివరణ కోరగా.. తాము ఎలాంటి ఆయుధాన్ని స్వాధీనం చేసుకోలేదని స్పష్టం చేశారు.

నియోజకవర్గాలకు టీటీడీపీ కో-ఆర్డినేటర్లు


వంశీకి నియామకపత్రం అందజేస్తున్న జ్ఞానేశ్వర్

సాక్షి, హైదరాబాద్: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కో-ఆర్డినేటర్లను నియమించారు. ఈ మేరకు టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ మంగళవారం వెల్లడించారు. భద్రాచలం(ఎస్టీ) నియోజకవర్గానికి ఈసం శశిధర్, ఇల్లెందు(ఎస్టీ)కు ముద్రగడ వంశీ, నర్సంపేటకు అడపా నర్సింగరావుని కో-ఆర్డినేటర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉనికి చాటుకోవడానికే దుశ్చర్యలు

భద్రాచలంఅర్బన్: మావోయిస్టులు ఉనికిని చాటుకోవడానికే దుశ్చర్యలకు పాల్పడుతున్నారని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పథకాలను అమలు చేయడంలో భాగంగా ఏజెన్సీ ప్రజానీకానికి విద్య, వైద్యం అందించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు. మావోయిస్టు అగ్రనాయకులు కిందిస్థాయి కేడర్‌తో చట్టవ్యతిరేక పనులు చేయిస్తున్నారని, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాల్లోని మైనర్లను బలవంతంగా మావోయిస్టు పార్టీలోకి చేర్చుకుని చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

ఆదివాసీని హతమార్చిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటన

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఓ ఆదివాసీని మావోయిస్టులు దారుణంగా హతమార్చారు. తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలోని తెర్రెపారా గ్రామానికి చెందిన అవలం అడమ (38) ఇంటి నిర్మాణానికి కలపను తీసుకొచ్చేందుకు సోమవారం కొందరు గ్రామస్తులతో కలిసి అటవీ ప్రాంతంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో అడవిలో అడమను అదుపులోకి తీసుకున్న మావోయిస్టులు.. గొడ్డళ్లతో నరికి హత్యచేశారు. మృతదేహాన్ని తెర్రెం పోలీస్ స్టేషన్‌కు కిలోమీటరు దూరంలో గల వ్యవసాయ పొలాల్లో పడవేశారు. కాగా, మంగళవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌ఫార్మర్ నెపంతోనే అడమను హతమార్చినట్లు తెలుస్తోంది.

పూరి గుడిసె దగ్ధం

కారేపల్లి: ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొని దగ్ధం కాగా, వృద్ధ దంపతులు నిరాశ్రయులయ్యారు. మండలంలోని గుంపెళ్లగూడెంకు గుగులోతు రాంజీ, ధ్వాలి దంపతులు పూరిగుడిసెలో నిద్రిస్తుండగా.. సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకుంది. దీంతో దంపతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కేకలు వేస్తూ బయటకు వచ్చారు. ఈమేరకు స్థానికులు మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోగా రూ.8వేలు నగదుతో పాటు బియ్యం, వంట సామాగ్రి, బట్టలు కాలిపోవటంతో వృద్ధులిద్దరూ కట్టుబట్టలతో మిగిలారు.

రెండో వారం నుంచి పుస్తకాల పంపిణీ


పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

జూలూరుపాడు: వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్యపుస్తకాలను ఈ నెల రెండో వారం నుంచి పంపిణీ చేయనున్నామని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. మంగళవారం మండలంలోని పాపకొల్లు హైస్కూల్‌లోని జిల్లా పాఠ్యపుస్తకాల గోదామును ఆయన సందర్శించి మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా పార్ట్-1, పార్ట్-2లకు సంబంధించి 7,15,090 పాఠ్యపుస్తకాలు అవసరమని, అందులో భాషా పాఠ్యపుస్తకాలు, ఆంగ్లమాధ్యమ, పార్ట్-1 ద్విభాషా పుస్తకాలు 5,69,950 కాగా, పార్ట్-2 ద్విభాషా పుస్తకాలు 1,38,200, ఇతర మాధ్యమ పుస్తకాలు 6,940 కావాల్సిఉందన్నారు. ఇప్పటికే 2,90,480 పార్ట్-1 పాఠ్యపుస్తకాలు గోదాముకు చేరుకున్నాయని, మిగతా పాఠ్యపుస్తకాలు వచ్చిన వెంటనే పాఠశాలలకు చేరవేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గుగులోత్ వెంకట్, గోదాము ఇన్‌చార్జ్ రవి, సిబ్బంది ప్రతాప్, బాలు, వెంకట్ ఉన్నారు.

బడి తెరిచిన రోజే యూనిఫాం అందిస్తాం..


టైలర్లు కుడుతున్న యూనిఫాంను పరిశీలిస్తున్న సైదులు

పాల్వంచ: బడి తెరిచిన రోజే విద్యార్థులకు కొత్త యూనిఫాం అందజేస్తామని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే సైదులు అన్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాంలు కుట్టే టైలర్ కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. రానున్న విద్యాసంవత్సరానికి ఆరంభంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ యూనిఫాం అందజేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని చెప్పారు. అందుకు అనుగుణంగా ఈ సంవత్సరం మార్చిలోనే యూనిఫాం క్లాత్‌ను పాఠశాలలకు అందించామని, టైలర్లు నూతన డిజైన్ల ప్రకారం యూనిఫాంలు కుట్టి మే 31వ తేదీ నాటికి అందజేస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్‌లు కిషన్, చందు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి వేదికగా ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాలు

టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మిడియం బాబూరావు


ఉత్సవాల వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ బాబూరావు

భద్రాచలంటౌన్: ఆదివాసీ సంస్కృతి ఉనికి, అస్తిత్వానికి ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యాన అపురూపమైన ఆదివాసీల సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని భద్రాచలం మాజీ ఎంపీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిడియం బాబూరావు అన్నారు. టీఏజీఎస్ ఆధ్వర్యాన భద్రాచలంలో జూనియర్ కళాశాల మైదానంలో ఈ నెల 3 నుంచి 6 వరకు నిర్వహించనున్న ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాల (రేలా పండూం) వివరాలను మంగళవారం ఆయన చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో వెల్లడించారు. ఆదివాసీ సాంస్కృతిక ఉత్సవాలు ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో గోండు, కొలం, మన్నెవార్లు, నాయకపోడు, తోటి, ప్రధాన్, ఆందు, చెంచు తదితర తొమ్మిది ఆదివాసీ జాతుల సాంస్కృతిక కళాప్రదర్శనలు ఉంటాయని, 5వ తేదీన భద్రాచలంలో వెయ్యి మంది కళాకారుల భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయని చెప్పారు. ఈ సభకు మాజీ ఎంపీ, ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకురాలు బృందాకారత్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు హాజరవుతారని తెలిపారు. ఇక 6వ తేదీన తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలో ఆదివాసీల అభివృద్ధిపై కార్యాచరణ రూపొందిస్తామని బాబూరావు వివరించారు. సమావేశంలో టీఏజీఎస్ నాయకులు బందారు రవికుమార్, కారం పుల్లయ్య, సున్నం గంగా, కుంజా శ్రీను, సోయం జోగారావు తదితరులు పాల్గొన్నారు.

మరణం కాదు.. ముగ్గురికి ఊపిరి..

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం


కుమారస్వామి (ఫైల్)

అశ్వాపురం: తాను మరణించినా మరో ముగ్గురికి ప్రాణం పోసి మూడు కుటుంబాల్లో వెలుగులు నింపాడు. మండల కేంద్రానికి చెందిన టీవీ మెకానిక్, న్యూ ఫ్యాన్సీ దుకాణం యజమాని బేతి కుమారస్వామి (52)కి మంగళవారం బ్రెయిన్‌డెడ్ అయింది. ఆయన కోరిక మేరకు గుండె, కిడ్నీలు, కాలేయం దానం చేశారు. కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన బేతి కుమారస్వామి (52) కొన్నేళ్ల కిందట అశ్వాపురం వచ్చి స్థిరపడ్డాడు. మండల కేంద్రంలో టీవీ మెకానిక్‌గా, ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తూ అందరికీ సుపరిచితుడుగా మారాడు. బేతి కుమారస్వామి మూడు రోజుల కిందట అకస్మాత్తుగా బీపీ ఎక్కువై ఇంట్లో పడిపాయడు. కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించారు. హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున బ్రెయిన్‌డెడ్ అయి మృతిచెందాడు. కుమారస్వామి కోరిక మేరకు కుటుంబ సభ్యులు మంగళవారం ఆయన గుండె, కిడ్నీలు, కాలేయం దానం చేశారు. కుమారస్వామి తాను మరణించినా మరో ముగ్గురికి ప్రాణం పోయడంతో స్థానిక వ్యాపారులు, స్థానికులు ప్రశంసలు కురిపించారు.

మా నాన్న కోరిక మేరకే..

మా నాన్న నేను చనిపోయినా నా అవయవాలు దానం చేయాలని గతంలోనే అమ్మకు, మాకు చెప్పాడు. మా నాన్న కోరిక మేరకు గుండె, కిడ్నీలు, కాలేయం దానం చేశాం. మా నాన్న చనిపోయిన బాధ ఉన్నా ఆయన నిర్ణయం మాకు గర్వంగా ఉంది. ప్రత్యక్షంగా మా నాన్న దూరమైనా పరోక్షంగా ముగ్గురు వ్యక్తుల్లో సజీవంగా ఉండటం మానసికంగా మాకు సంతోషాన్ని మిగిల్చింది.

– బేతి హరిత, మృతుడి కుమార్తె

క్లుప్తంగా...

సీబీఐ విచారణకు హాజరైన వివేకా పీఏ కృష్ణారెడ్డి

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వివేకా పీఏ కృష్ణారెడ్డిని మంగళవారం ప్రశ్నించారు. హత్యకు ముందు వివేకానందరెడ్డి రాసిన లేఖను కృష్ణారెడ్డి దాచిపెట్టిన విషయంపైనే ఎక్కువ ప్రశ్నలు అడిగినట్టు సమాచారం. మధ్యాహ్నం 3 గంటలకు కోఠిలోని సీబీఐ కార్యాలయానికి వచ్చిన కృష్ణారెడ్డిని ఐదు గంటలకు పైగా ప్రశ్నించారు. హత్య జరిగిన ప్రాంతంలో లభించిన కీలక ఆధారమైన ఆ లేఖను ఎందుకు దాయాల్సి వచ్చింది? ఎవరు ఆదేశాలిచ్చారు? లేఖను ఎవరు తొలుత గుర్తించారు? తర్వాత దాన్ని ఎక్కడ దాచిపెట్టారు? లేఖ విషయం తొలుత ఎవరెవరితో పంచుకున్నారు? లేఖను ఎన్ని గంటలకు పోలీసులకు అప్పగించారు? అప్పటి వరకు లేఖను గోప్యంగా ఉంచడానికి ప్రత్యేక కారణాలేమైనా ఉన్నాయా?.. ఇలా అనేక అంశాలపై సీబీఐ అధికారులు ప్రశ్నించారు. అధికారుల ప్రశ్నలకు కృష్ణారెడ్డి ముక్తసరిగా సమాధానాలిచ్చినట్లు తెలిసింది. ఇటీవల పులివెందులలోని కృష్ణారెడ్డి ఇంటికి సీబీఐ అధికారులు వెళ్లగా, ఆ సమయంలో ఆయన అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యుల నుంచే వివరాలు సేకరించారు. ఆ తర్వాత విచారణకు హాజరుకావాలని కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన మంగళవారం సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు.

వివేకా హత్యకేసులో సాక్షి రంగన్న పరిస్థితి విషమం

వయసు రీత్యా అనారోగ్య సమస్యలు



పులివెందుల: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సాక్షిగా ఉన్న వాచ్‌మన్ రంగన్న ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. వివేకా హత్య జరిగిన రోజు అక్కడే ఉన్న వాచ్‌మన్ రంగన్న కోర్టుకు ఇచ్చిన 164 స్టేట్‌మెంట్‌లో కూడా వివేకాను ఎర్ర గంగిరెడ్డి, ఉమా శంకర్‌రెడ్డి, సునీల్‌యాదవ్, దస్తగిరి హత్యచేశారని చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వయసు రీత్యా పలు అనారోగ్య కారణాలవల్ల వాచ్‌మన్ రంగన్న ఆరోగ్య పరిస్థితి దెబ్బతింది. దీంతో వాచ్‌మన్ రంగన్న ఇంటివద్ద ఉన్న సెక్యూరిటీ పోలీసులు, కుటుంబసభ్యులు మంగళవారం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో రంగన్నను అంబులెన్స్‌లో తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు.

విశ్వ నగరం వెలుగు రేఖలు

విశాఖలో అత్యాధునికంగా విద్యుత్ వ్యవస్థ

- ఆర్థిక నగరం భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా భూగర్భ కేబుళ్లు
- తుపాన్లు వచ్చినా సరఫరా నిలిచిపోకుండా రూ.925 కోట్లతో నిర్మాణం



విశాఖపట్నం నుంచి సాక్షి ప్రతినిధి: ఏదైనా ఒక రాష్ట్రం, ప్రాంతం ఆర్థిక స్థితిని అంచనా వేయడంలో విద్యుత్ వినియోగం కీలక పాత్ర పోషిస్తుంది. విశ్వ నగరంగా మారిన విశాఖ ఆర్థిక రాజధానిగా బలంగా ఎదిగేలా విద్యుత్ వ్యవస్థ రూపుదిద్దుకుంటోంది. భారీ పరిశ్రమలు, ఐటీ పార్కులు, డేటా సెంటర్లు, హోటళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, మాల్స్, ఆస్పత్రులు, ఇతర వాణిజ్య కార్యకలాపాల కోసం నిరంతరం, నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా విశాఖలో అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగని విధంగా భూగర్భం నుంచి కేబుళ్ల ద్వారా విద్యుత్ పంపిణీ కానుంది. పారిశ్రామికవేత్తలు, పర్యాటకులను ఆకర్షించడంతోపాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విశాఖలో సిద్ధమవుతున్న ఆధునిక విద్యుత్ వ్యవస్థపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్ ఇదీ..

తుపాన్లకు తల వంచదు..

రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి సైతం ఎంతోమంది ఉద్యోగాలు, వ్యాపారాల కోసం వచ్చి విశాఖలో స్థిరపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాలను అందిపుచ్చుకుంటూ పలువురు పారిశ్రామికవేత్తలు సాగర నగరిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థను మరింత అభివృద్ధి చేసేందుకు డిస్కమ్‌లు సిద్ధమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పనులు కూడా మొదలయ్యాయి. తుపాన్లు లాంటి విపత్తుల సమయంలోనూ విశాఖ నగరం అంతటా విద్యుత్ వెలుగులకు ఆటంకం కలుగకుండా రూ.925 కోట్లతో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రూ.481.49 కోట్ల ఖర్చుతో 80,529 విద్యుత్ కనెక్షన్లను భూగర్భ విద్యుత్ వ్యవస్థలోకి తెచ్చారు. నగరం మొత్తం 2,449 కి.మీ. పొడవున అండర్ గ్రౌండ్ కేబులింగ్ చేయనున్నారు. సముద్రాన్ని ఆనుకుని ఉన్న నగరం కావడంతో తుపాన్లు వచ్చినపుడు విద్యుత్ స్తంభాలు దెబ్బతింటున్నాయి. ఇకపై అలాంటి పరిస్థితి తలెత్తకుండా పాత స్తంభాల స్థానంలో సెంట్రిఫ్యూగల్లీ కాస్ట్ రీఇన్ఫోర్స్ కాంక్రీట్ స్తంభాలు (స్పన్‌పోల్స్) ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 3,266 స్పన్‌పోల్స్ ఏర్పాటు కాగా అందుకోసం రూ.15.36 కోట్లను వెచ్చించారు. నష్టాల తగ్గింపు, ఆధునీకరణ పనులను సుమారు రూ.1,722.02 కోట్లతో చేపట్టారు. ఇందులో భాగంగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 16 నిర్మించనున్నారు. గత మూడు నెలల్లో 421 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

'భోగాపురం' భూమి పూజ నేడే

సాక్షి, అమరావతి, సాక్షి ప్రతినిధి, విజయనగరం: భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేయనున్నారు. దీంతోపాటు విజయనగరం జిల్లాలో మరో రెండు కీలక ప్రాజెక్టులు, విశాఖలో రూ.21,844 కోట్లతో అదానీ గ్రూప్ నిర్మించే వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్‌కు సీఎం శంకుస్థాపన చేస్తారు. రూ.4,592 కోట్లతో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణం కానుండగా ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసేలా వైజాగ్ టెక్ పార్కు రూపుదిద్దుకోనుంది. సీఎం జగన్ భోగాపురం మండలం సవరవిల్లి వద్ద నిర్వహించే సభలో ప్రసంగించనున్నారు.

టీఎస్ ఈసెట్-2023 దరఖాస్తుల గడువు పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్ ఈసెట్–2023 దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 8 వరకు పొడిగిస్తున్నట్లు కన్వీనర్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ మంగళవారం పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 11 వరకు, రూ.1000 అపరాధ రుసుముతో 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. మే 20న ఏపీలో నాలుగు చోట్ల, తెలంగాణలో 17 ప్రాంతాలలో జరిగే ప్రవేశ పరీక్షకు 21,500 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఢిల్లీ సిగలో 'గులాబీ'

- దేశ రాజధానిలో సిద్ధమైన బీఆర్‌ఎస్ కార్యాలయం
- రేపు ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- వాస్తుపూజతోపాటు సుదర్శన హోమం
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి వేముల, ఎంపీ సంతోష్



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమైన భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. ఐదు అంతస్తుల్లో నిర్మితమైన ఈ భవనాన్ని ఈ నెల 4న తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. గురువారం ఉదయం వాస్తు పూజతోపాటు సుదర్శన హోమం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1:05 గంటలకు కేసీఆర్ ఈ భవనాన్ని ప్రారంభిస్తారు.

ఆంక్షలతో ఆలస్యం

ఢిల్లీలోని వసంత్ విహార్‌లో 2021 సెప్టెంబర్ 2న కేసీఆర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావించినప్పటికీ.. ఢిల్లీలో కాలుష్యం కారణంగా నిర్మాణ పనులపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీంతో అనుకున్న సమయానికి పూర్తి చేయలేకపోయారు. ఏడాదిన్నరగా రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ నిర్మాణ సంస్థపై ఒత్తిడి పెంచుతూ పనులు వేగంగా జరిగేలా చూశారు. బీఆర్‌ఎస్ భవన్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైన నేపథ్యంలో ప్రశాంత్ రెడ్డి, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ మూడు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు.

ఐదంతస్తుల్లో 20 వేల చదరపు అడుగులు

మొత్తం 1,300 గజాల్లో ఉన్న స్థలంలో 20 వేల చదరపు అడుగుల ప్రాంతంలో భవనాన్ని నిర్మించారు. అందులో లోయర్ గ్రౌండ్, గ్రౌండ్, మొదటి, రెండవ, 3వ అంతస్తులతో కలిపి మొత్తం 5 అంతస్తులు న్నాయి. లోయర్ గ్రౌండ్‌లో మీడియా సమావేశాల ను నిర్వహించేందుకు వీలుగా మీడియా హాల్‌తోపాటు రెండు ఇతర గదులను నిర్మించారు. లోయర్ గ్రౌండ్‌లోకి వచ్చే మీడియాకు వీలుగా ఉండేలా ప్రత్యేక ఎంట్రెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శుల కోసం నాలుగు గదులు, కార్యాలయ రిసెప్షన్, కార్యకర్త లు, నాయకుల కోసం క్యాంటీన్‌ను సిద్ధం చేశారు. మొదటి అంతస్తులో పార్టీ అధ్యక్షుడి చాంబర్, పేషీ, కాన్ఫరెన్స్ హాల్ ఉన్నాయి. 2,3 అంతస్తుల్లో ఢిల్లీలో పార్టీకి సంబంధించిన కార్యక్రమాలకు వచ్చే కార్యకర్తలు, నాయకులు బస చేసేందు కు 18 గదులతోపాటు రెండు ప్రత్యేక సూట్ రూమ్‌లను సిద్ధం చేశారు. సూట్ రూమ్‌లలో పార్టీ అధ్యక్షుడు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బస చేస్తారు.

మహారాష్ట్రలో ప్రభంజనం ఖాయం: కేసీఆర్

- కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు నన్ను సంప్రదిస్తున్నారు
- అధికారంలోకి వస్తే అక్కడ తెలంగాణ మోడల్
- 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' మూలమూలకూ వెళ్లాలి
- మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నేతలతో భేటీ



మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నేతలతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రజాచైతన్యమే తమ పార్టీ ఆయువుపట్టు అని, మహారాష్ట్రలో ప్రభంజనం సృష్టిస్తుందని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్‌కు వస్తున్న ఆదరణ చూసి మహారాష్ట్రకు చెందిన అనేకమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు తనతో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. మహారాష్ట్రలో ఏం జరగబోతోందో మీరే చూస్తారు అని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వస్తే మహారాష్ట్రలో తెలంగాణ మోడల్ అమలు చేస్తామని అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మహారాష్ట్రకు చెందిన ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు. అక్కడ బీఆర్‌ఎస్ అనుసరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. మే 10 నుంచి జూన్ 10 వరకు మహారాష్ట్ర మూల మూలకు 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదం వెళ్లాలని స్పష్టం చేశారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

'మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, బ్లాక్ స్థాయి ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు ఇప్పటికే బీఆర్‌ఎస్‌లో చేరారు. కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా రావటానికి సిద్ధంగా ఉన్నారు. అనేకమంది నాతో సంప్రదింపులు, చర్చలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ సిద్ధాంతాన్ని, లక్ష్యాన్ని ప్రజలకు చేరవేసి వారి ప్రేమను పొందాలి. ప్రజల మనసులు గెలవడం బీఆర్‌ఎస్ లక్ష్యం. తెలంగాణ తర్వాత మహారాష్ట్రకే దేశాన్ని మలుపుతిప్పే అవకాశం వచ్చింది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి' అంటూ కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

త్వరలో జిల్లా సమన్వయకర్తల నియామకం

రెండు, మూడురోజుల్లో జిల్లా సమన్వయకర్తల నియామకం పూర్తి చేస్తామని, మే 10 నుంచి జూన్ 10 వరకు పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు పూర్తి కావాలని కేసీఆర్ ఆదేశించారు. ఒకేరోజు ఒకే సమయంలో 288 నియోజకవర్గ కేంద్రాల నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణం ప్రారంభం కావాలన్నారు. శివాజీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద నుంచి పార్టీ కార్యక్రమాలు ప్రారంభం కావాలని చెప్పారు. సాధారణ సభ్యత్వానికి రూ.10, క్రియాశీల సభ్యత్వానికి రూ.50 చొప్పున తీసుకోవాలన్నారు. మే 8, 9 తేదీల్లో మహారాష్ట్ర నేతలకు హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శిక్షణ శిబిరాలు ఉంటాయని తెలిపారు. ఈ భేటీలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, పీయూసీ చైర్మన్ జీవన్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యే జోగురామన్న, మాజీ ఎంపీ నగేశ్, దాసోజు శ్రవణ్, మహారాష్ట్ర ముఖ్యనేతలు మాణిక్ కదం, మాజీ ఎమ్మెల్యే శంకరన్న డోంగే, మాజీ మేయర్ రవీంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఆహ్వానమే లేదు

- అందుకే సచివాలయ ప్రారంభోత్సవానికి హాజరు కాలేదు
- రాజ్‌భవన్ నుంచి ప్రకటన విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నూతన సచివాలయ భవన ప్రారంభోత్సవానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందలేదని రాజ్‌భవన్ స్పష్టం చేసింది. ఆహ్వానించినా ఆమె గైర్హాజరయ్యారనడం నిరాధారణ, తప్పుడు ఆరోపణలని తోసిపుచ్చింది. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ప్రగతి నిరోధక శక్తులు తట్టుకోలేకపోతున్నాయని, సచివాలయ ప్రారంభోత్సవానికి గవర్నర్ రాకపోవడం అందులో భాగమేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి సోమవారం సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించిన విషయం తెలిసిందే. ప్రారంభోత్సవానికి రావడం, రాకపోవడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆయన ఆరోపణలపై రాజ్‌భవన్ పరోక్షంగా స్పందించింది. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

జిల్లా వార్తలు

జేపీఎస్‌ల సమ్మెపై సీఎం స్పందించాలి



సమ్మె శిబిరంలో పాల్గొన్న వీరభద్రం

ఖమ్మంరూరల్: క్రమబద్ధీకరణతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెపై సీఎం కేసీఆర్ స్పందించి వారికి న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. ఖమ్మంరూరల్ మండలం జలగంనగర్‌లో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె మంగళవారం ఐదో రోజుకు చేరగా తమ్మినేని వారికి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో తక్కువ వేతనానికి వెట్టిచాకిరీ చేయించుకుంటుండగా, క్రమబద్ధీకరణపై దృష్టి సారించడం లేదన్నారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో జరిగిన తెలంగాణ గిరిజన సంఘం సమావేశంలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ గిరిజన అభివృద్ధి, సంక్షేమం కోసం ఖమ్మం కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు బండి రమేశ్, మోహన్‌రావు, నంద్ర ప్రసాద్, బషీరుద్దీన్, వీరన్న, సిద్ధినేని కోటయ్య, కర్లపూడి సుభద్ర, శ్రీనివాస్, వీరభద్రం, బోస్‌నాయక్, నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

జేవీఆర్ ఓసీని సందర్శించిన డైరెక్టర్



అధికారులకు సూచనలు చేస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీలోని ఈపీసీ, సీహెచ్‌పీలను మంగళవారం సింగరేణి డైరెక్టర్ డి.సత్యనారాయణ మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా కొత్తగూడెం ఏరియా జీఎం సుధాకర్‌రావుతో కలిసి ఆయన పరిశీలించాక మాట్లాడుతూ బెల్ట్‌లు, యూనిట్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడా దుమ్ము పేరుకుపోకుండా చూడాలని సూచించారు. తద్వారా ఈపీసీ, సీహెచ్‌పీ నిర్వహణకు ఆటంకం ఏర్పడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం స్వామినాయుడు, అధికారులు సూర్యనారాయణ, రఘురామిరెడ్డి, కృష్ణయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

'పట్టు'కుంటే లాభాలే..!

- మల్బరీ సాగు, పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు
- తక్కువ పెట్టుబడితో ఏటా ఆరు నుంచి ఏడు పంటలు
- ప్రతీ పంటకు రూ.1.20 లక్షలపైనే ఆదాయం
- ఉమ్మడి జిల్లాలో రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



మల్బరీ తోట

ఖమ్మంవ్యవసాయం: పట్టు పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఇచ్చే పట్టు పరిశ్రమల స్థాపనకు రైతులు ముందుకొచ్చేలా రాయితీలు ప్రకటించింది. మల్బరీ సాగు, పరిశ్రమల ఏర్పాటు, నిర్వహణకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం సిల్క్ సమగ్ర పథకం ద్వారా ఈ రాయితీలను ఇవ్వనుంది. అలాగే, నర్సరీల పెంపకా నికి కూడా రాయితీలు ప్రకటించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పట్టు పరిశ్రమ నిర్వహణ, మల్బరీ సాగుకు వనరులు, అనుకూలతలు ఉండటంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం, ఖమ్మం రూరల్, ఖమ్మం అర్బన్, వైరా, తిరుమలాయపాలెం తదితర మండలాల్లో 57, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో బూర్గంపాడు, పాల్వంచ, అశ్వాపురం తదితర మండలాల్లో 160 పట్టు పరిశ్రమలను రైతులు నిర్వహిస్తున్నారు.

సిల్క్ సమగ్ర పథకం రాయితీలు (రూ.ల్లో)

పంట సాగు, పరిశ్రమ	సాధారణ	ఎస్సీ సబ్‌ప్లాన్	ఎస్టీ సబ్‌ప్లాన్
రెండెకరాల్లో మల్బరీ సాగు	60,000	78,000	78,000
డ్రిప్	50,000	65,000	65,000
రేరింగ్ షెడ్ నిర్మాణం	2,25,000	2,92,500	2,92,500
రేరింగ్ స్టాండ్ల నిర్మాణం	15,456	26,706	26,706
పట్టు పురుగుల పరికరాలు	37,500	37,500	37,500
రోగనిరోధక మందులు	2,500	3,250	3,250
కిసాన్ నర్సరీ	75,000	97,500	97,500
(యూనిట్ రూ.1.50 లక్షలు)			

ఏటా రూ.7 లక్షలకు పైగా ఆదాయం

పట్టు పరిశ్రమ నిర్వహణతో ఏటా ఆరు నుంచి ఏడు పంటలు తీసే అవకాశం ఉంది. ప్రతి 35 రోజులకు పట్టు గూళ్లను ఉత్పత్తి చేయవచ్చు. ఒక్కో పంట ద్వారా రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అంటే ఏడాదిలో ఏడు పంటలు పండిస్తే (పట్టుగూళ్లు తీస్తే) సగటున రూ.7 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. వాణిజ్య పంటల కంటే మిన్నగా మల్బరీ సాగు, పట్టు గూళ్ల పెంపకం నుంచి ఆదాయం గడించే అవకాశం ఉండగా.. తెగుళ్ల బెడద లేకపోవడంతో క్రిమిసంహారక మందుల అవసరం లేదు. నల్ల రేగడి, చౌడు భూములు మినహా అన్ని రకాల నేలల్లో మల్బరీ పంటను పండించొచ్చు. నీటి వినియోగం కూడా తక్కువగానే ఉంటుంది. మల్బరీ సాగు చేసిన మొదటి ఏడాది మాత్రం మూడు పంటలను తీసే అవకాశం ఉంది. మల్బరీ మొక్కలను ఒక్కసారి నాటితే 10 నుంచి 15 ఏళ్ల పాటు పట్టు గూళ్ల పెంపకానికి వినియోగించుకోవచ్చు.


పట్టు గూళ్లకు పెరుగుతున్న డిమాండ్

పట్టు గూళ్లకు కొంతకాలంగా డిమాండ్ పెరుగుతోంది. నాణ్యత ఆధారంగా పట్టుగూళ్లకు ధర నిర్ణయించి రీలింగ్ యూనిట్ల నిర్వాహకులు కొనుగోలు చేస్తారు. రెండేళ్ల కిందట కిలో పట్టు గూళ్ల ధర రూ.400 వరకు ఉండగా, ఈ ఏడాది రూ.600 పలుకుతోంది. పట్టుగూళ్లకు డిమాండ్ ఉన్నా రీలింగ్ యూనిట్ల నిర్వాహకులకు ఆశించిన స్థాయిలో గూళ్ల లభ్యత లేకపోవటంతో ధరకు రెక్కలొస్తున్నాయి. నాణ్యత ఆధారంగా పట్టు గూళ్లకు ధర మరింత పెరిగే అవకాశముందని పరిశ్రమ నిర్వాహకులు చెబుతున్నారు.

అందుబాటులోకి పట్టుగూళ్ల మార్కెట్లు

పట్టుగూళ్లు కొనుగోలు చేసే మార్కెట్లను రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే జనగామలో నెలకొల్పిన ఆటోమెటిక్ రీలింగ్ యూనిట్ పట్టుగూళ్ల కొనుగోలు కేంద్రం దేశంలోనే ఖ్యాతి గడించింది. ఆ యూనిట్ నిర్వహణ, నాణ్యతలో దేశంలో రెండోదిగా గుర్తింపు సాధించింది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలకు ప్రయోజనం కలిగేలా సూర్యాపేటలో ఆటోమెటిక్ రీలింగ్ యూని ట్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనికి తోడు వికారాబాద్, సిద్దిపేటల్లో కూడా ఆటోమెటిక్ రీలింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

పంట, పరిశ్రమతో అధిక ఆదాయం



సంప్రదాయ పంటల కంటే మిన్నగా మల్బరీ సాగు, పట్టు పరిశ్రమ నిర్వహణతో ఆదాయం వస్తుంది. పట్టు గూళ్లకు డిమాండ్ పెరుగుతోంది. పరిశ్రమ నిర్వహణ, పంట సాగులో ఖర్చు తక్కువగా, ఆదాయం ఎక్కువగా ఉంటుంది. ఏటా ఏడు పంటలను ఇచ్చే పట్టు పరిశ్రమ పంటను ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి చేసేందుకు కృషి జరుగుతోంది. రైతులు పట్టు పరిశ్రమ, ఉద్యాన అధికారులు, కార్యాలయాల్లో సంప్రదించవచ్చు.

–జి.అనసూయ, ఉమ్మడి ఖమ్మం జిల్లా పట్టు పరిశ్రమ సమన్వయ అధికారి

ఉమ్మడి జిల్లాలో 380 ఎకరాల లక్ష్యం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 380 ఎకరాల్లో మల్బరీ సాగు, పరిశ్రమల స్థాపన లక్ష్యంగా పట్టు పరిశ్రమ శాఖ ప్రణాళిక రూపొందించింది. ఖమ్మం జిల్లాలో 150 ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 230 ఎకరాల్లో మల్బరీ సాగుకు రైతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నారు. సాధారణ రైతులతో పాటు, ఎస్సీ, ఎస్టీ రైతులకు పట్టు పరిశ్రమల స్థాపనలో ప్రాధాన్యం ఇస్తున్నారు. సాధారణ రైతుల కన్నా వీరికి రాయితీలు మరింత ఎక్కువగా లభిస్తాయి.

ఐటీఐ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలం: ఐటీడీఏ ఆధ్వర్యాన ఇస్తున్న జేఈఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని గిరిజన విద్యార్థులు ఎక్కువ మంది ఐఐటీ సీట్లు సాధించాలని ఐటీడీఏ ఏపీఓ(జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో జేఈఈ అడ్వాన్స్‌డ్ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు సూచనల తో శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. నిరుపేద గిరిజన విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రఖ్యాత యూనివర్సిటీలు, కళాశాలల్లో సీట్లు సాధించాలని ఆకాంక్షించారు. కాగా, ఎంపిక చేసిన విద్యార్థినులకు భద్రాచలంతో పాటు దమ్మపేట, కిన్నెరసానిల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జేఈఈ మెయిన్స్‌లో ఎక్కువ మంది అర్హత సాధించేలా శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను ఏపీఓ అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ దేవదాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- కొత్త కోర్సులకు ముందుకొస్తే అనుమతి
- కేయూ వీసీ ఆచార్య రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, నైపుణ్యాల అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం కావాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ తెలిపారు. వరంగల్‌లోని కేయూ పరిపాలన భవనం సెనేట్‌హాల్‌లో మంగళవారం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్ల సమావేశం ఏర్పాటుచేయగా వీసీ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వచ్చే విద్యాసంవత్సరం(2023–2024)లో ఉపాధి కల్పనకు కొత్త కోర్సులు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చే కళాశాలలకు అనుమతి ఇస్తామన్నారు. అయితే ఆయా కళాశాలల్లో అన్ని మౌలిక వసతులు ఉండాలని తెలిపారు. ప్రతీ ఉమ్మడి జిల్లాకు పది చొప్పున 30 కళాశాలలకు అవకాశం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా తరగతిగదులు, ల్యాబ్ సదుపాయాలు మెరుగుపర్చుకోవాలని, ప్రభుత్వ, ప్రైవేట్ తేడా లేకుండా అన్ని కళాశాలలు న్యాక్ గుర్తింపునకు సిద్ధం కావాలని సూచించారు. ఎంపిక చేసిన ప్రభుత్వ కళాశాలలను రీసెర్చ్ సెంటర్లుగా గుర్తించి పలువురు అధ్యాపకులకు పీహెచ్‌డీ గైడ్‌షిప్ ఇచ్చామన్నారు. కాగా, డిగ్రీ ఫలితాలను త్వరలో విడుదల చేయనున్నట్లు వీసీ వెల్లడించారు. పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, కేయూ సీడీసీ డీన్ ఆచార్య వి.రాంచంద్రం మాట్లాడగా రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాసరావు, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఆచార్య ముస్తఫా, డాక్టర్ జె.మధుకర్, ఎస్.జ్యోతి, సీహెచ్.రాధిక, ఎ.నరేందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు డాక్టర్ కోలా శంకర్, రామా వెంకటేశ్వర్లు, హబీబ్, ఆర్.శ్రీలతాదేవి, డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యాన శ్రీనివాస కల్యాణం

రేపు నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో నిర్వహణ



కల్యాణోత్సవ వివరాలు వెల్లడిస్తున్న ప్రతినిధులు

బూర్గంపాడు: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన ఈనెల 4న బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని గొమ్మూరు వ్యవసాయ క్షేత్రంలో శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు కల్యాణ వేదిక వద్ద మంగళవారం వారు వివరాలు వెల్లడించారు. తిరుమల నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలతో అర్చకులు, వేదపండితులు చేరుకుని కల్యాణోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. తిరుమల నుంచి స్వామివారి రథం కల్యాణోత్సవ ప్రాంగణానికి బుధవారం సాయంత్రం చేరుకోనుండగా భక్తులు స్వాగతం పలకాలని కోరారు. భక్తులకు ఐటీసీ పీఎస్‌పీడీ ఆధ్వర్యాన అన్నప్రసాదాలు సమకూరుస్తున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ మల్లేశ్వరరావు, సర్పంచ్ భూక్యా శ్రావణి, ఐటీసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్‌తో పాటు యడమకంటి ఝాన్సీలక్ష్మి, బిజ్జం శ్రీనివాసరెడ్డి, వై.పిచ్చిరెడ్డి, గోనె దారుగా, కె.పెద్దిరెడ్డి, సోము సుబ్బారెడ్డి, యారం వెంకట్రామిరెడ్డి, కోట నాగిరెడ్డి, దారం కృష్ణారెడ్డి, బి.వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణ, బానోత్ రామదాసు, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పోతిరెడ్డి వెంకటరెడ్డి, భూక్యా శివకృష్ణ పాల్గొన్నారు.